ఆవ భూములపై యావ!

- అక్రమార్కుల చెరలో ప్రభుత్వ భూములు
- సాగు కోసం రైతులకు పంపకాలు
- నేతల అండదండలతో తమ్ముళ్ల దోపిడీ

కోరుకొండ: ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాలై ఇతరులకు సాగు హక్కులిచ్చేసి రూ.లక్షలు స్వాహా చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాల కోసం సేకరించిన 580 ఎకరాల భూములలో కూటమి నేతల దందా చేస్తున్నారు. ఆ భూములను పలువురికి కౌలుకు ఇచ్చి ఆరుతడి పంటలకు అనుమతులిచ్చేస్తున్నారు. నాడు ముంపు ప్రాంతమని, ఇళ్ల స్థలాలకు పనికిరావని గగ్గోలు పెట్టిన కూటమి నాయకులు నేడు అవే భూములలో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ప్రకృతి సహజసిద్ధంగా పెరిగిన జామాయిల్ చెట్లను రాత్రివేళల్లో అక్రమంగా నరికి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు.

4 గ్రామాల పరిధిలోని భూములు

కోరుకొండ మండలంలోని బూరుగుపూడి, గుమ్ములూరు, బుచ్చెంపేట, కాపవరం గ్రామాల పరిధిలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 580 ఎకరాల భూములను పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే లక్ష్యంతో కొనుగోలు చేసింది. నాటి నుంచి ఆ భూములు ప్రభుత్వ భూములుగా ఉన్నాయి. కాగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఈ భూముల్లో అనుయాయులకు, అడిగిన వారికి సాగు చేసుకునేందుకు కౌలుకు ఇచ్చేసి అక్రమ దందాకు పాల్పడుతున్నారు.

రాబోయే సంవత్సరానికి బేరాలు మొదలు

ఈ భూముల్లో రబీ జోరుగా సాగవుతోంది. దానికి అనుగుణంగా వచ్చే శీతాకాలం సాగుచేయడానికి నేటి నుంచి కౌలు బేరాలను ప్రారంభించారు. ఎకరానికి రూ.3 వేలు నుంచి రూ.4 వేల చొప్పున రైతుల నుంచి వసూలు చేస్తున్నారు.

సాగయ్యే పంటలు

ఈ ప్రభుత్వ భూములు మొక్కజొన్న, శనగ, వేరుశనగ, పప్పుధాన్యాలు సాగుచేయడానికి అనుకూలం. అలాగే ఆరుతడి పంటలు, కూరగాయలు పండించడానికి అనువుగా ఉంటాయి. వర్షాకాంలో నీటి లభ్యత బాగుండడంతో సాగుకు అనుకూలంగా కూడా ఉంటుంది. వందలాది ఎకరాలను ఎలా పంచుకోవాలనే విషయమై కూటమి నేతల్లో చర్చోపచర్చలు జరుగుతున్నాయి.

ఎకరానికి 6 వేల చెట్లు..

ఎకరానికి 6 వేలు జామాయిల్ చెట్ల చొప్పున 580 ఎకరాల్లోని చెట్లను నరికేసి చెట్టుకు రూ.30 చొప్పున కమీషన్ పొంది అక్రమార్జనకు పాల్పడ్డారు. ఈ చెట్లను నరికివేయడంతో ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం పెరిగింది.



ఆవ భూముల్లో జామాయిల్ చెట్లు నరికేయడంతో వచ్చే రబీ సీజన్‌కు సన్నద్ధమైన భూమి



ప్రభుత్వ భూమిలో శనగపంట సాగు చేసిన అక్రమార్కులు



గత సీజన్‌లో మొక్కజొన్న సాగై, ఖాళీ అయిన ప్రభుత్వ భూమి

ప్రభుత్వ భూములను కాపాడాలి



ప్రభుత్వ భూములను సంరక్షించడానికి గట్టి చర్యలు చేపట్టాలి. ఆవ భూముల్లో అక్రమంగా జరుగుతున్న సాగును అరికట్టాలి. ప్రకృతి సిద్ధంగా పెరిగిన జామా యిల్ చెట్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. ప్రభుత్వ భూములను రాజకీయ దళారులు కౌలుకు ఇచ్చి, అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలి.

– నక్కా రాంబాబు, సర్పంచ్, గుమ్ములూరు

సత్వర చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వం కొనుగోలు చేసిన ఆవ భూములను. దానిలోని సంపదను కాపాడాలి. అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. అక్రమార్కుల చెరలోకి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

– కర్రి నాగేశ్వరరావు, కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు

ప్రభుత్వ భూములు సంరక్షిస్తాం



బూరుగుపూడి సమీపంలోని ప్రభుత్వ (ఆవ) భూములను సంరక్షిస్తాం. బూరు గుపూడి, కాపవరం, గుమ్ములూరు, బుచ్చెంపేట పరిధిలోని భూముల సంరక్షణకు కృషి చేస్తాం. ఈ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనలను అనుసరించి చర్యలు తీసుకుంటాం.

– సుస్వాగతం, తాహసీల్దార్, కోరుకొండ

క్లుప్తంగా

కోరుకొండ సీడీపీఓగా సంధ్యారాణి



కోరుకొండ: కోరుకొండ సీడీపీఓగా డి.సంధ్యారాణి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఐసీడీఎస్‌లో జరిగిన బదిలీల్లో భాగంగా ఆమె కోరుకొండకు వచ్చారు. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు, ప్రభుత్వం అందిస్తున్న సహాయ,సంక్షేమ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. ఆమెకు కాపవరం కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. సంధ్యారాణి ఇంతకు ముందు రంపచోవరం సీడీపీఓగా బాధ్యతలు నిర్వహించారు.

ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు



ముగ్గళ్ల నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

రాజానగరం (సీతానగరం): నియోజకవర్గంలోని సీతానగరం మండలంలో గోదావరి ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. ప్రభుత్వం అనుమతించిన వంగలపూడి, రఘుదేవపురం, మునికూడలి, కాటవరం, సింగవరంలలో ఇసుక తవ్వకాలను అధికారికంగా నిలిపివేసినప్పటికీ అధికార పార్టీ పెద్దల అండదండలతో కొందరు అక్రమ తవ్వకాలు చేస్తూ రాశులుపోసి మరీ విక్రయించేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా నదీ గర్భంలోకి వెళ్లి మరీ ఇసుకను తోడేస్తున్నారు. ముగ్గళ్ల – కూనవరం, బొబ్బిలిలంక వద్ద ఇసుక గుట్టలు పెట్టి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు. రెవెన్యూ, గనుల శాఖల అధికారులు తమ ఉనికిని కోల్పోకుండా అప్పుడప్పుడు దాడులు చేసి నామమాత్రపు జరిమానాలు విధిస్తుండడాన్ని స్థానికులు విమర్శిస్తున్నారు. ఒక లారీ ఇసుకను అమ్మితే రూ.25 వేలు వస్తున్న తరుణంలో ఈ జరిమానాలు ఒక లెక్కా అన్నట్టుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.

మట్టి పరీక్షలతో మంచి దిగుబడులు

రాజానగరం: సాగు పనులను చేపట్టే ముందే మట్టి పరీక్షలు చేయించుకుని, తదనుగుణంగా ఎరువులు, పురుగు మందులను వాడితే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని రాజమహేంద్రవరంలోని మట్టి పరీక్ష ప్రయోగశాల (సాయిల్ టెస్టింగ్ లాబొరేటరీ) అధికారి ఒ.సరళ అన్నారు. మండలంలోని దివాన్‌చెరువులో ఉన్న జిల్లా ఏరువాక కేంద్రంలో కోనసీమ జిల్లాలోని 15 వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు చెందిన డీలర్లకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఇస్తున్న శిక్షణ తరగతులు శనివారం నాటికి ఆరో రోజుకు చేరాయి. ×మట్టి పరీక్ష ఆధారిత ఎరువులు వాడకం – ఆవ్యకత౯ అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్‌లు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

సారా దుష్ప్రభావాలపై అవగాహన

రంగంపేట: మండల పరిధిలోని దొడ్డిగుంట గ్రామంలో ఎక్సైజ్ సీఐ సుధ ఆధ్వర్యంలో సారా వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. నవోదయం 2.0లో భాగంగా శనివారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌రిధిలో ఏబీసీ కేటగిరిలో గల 29 గ్రామాలలో గత మూడు నెలల్లో సారా వలన కలిగే నష్టాలపై అవగాహన నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలకు సారా, తయారీ, విక్రయాలు, సేవించడం వల్ల పర్యవసానాలను వివరించామన్నారు. మళ్లీ మళ్లీ నేరాలకు పాల్పడిన 15 మందికి రూ.1.58 లక్షల జరిమానా విధించినట్టు తెలిపారు.

ఘనంగా గంగాలమ్మ జాతర



బిక్కవోలు: మండలంలోని కొంకుదురులోని గంగాలమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనతరం గరగనృత్యాలు, తీన్‌మార్, బుట్ట బొమ్మలు, శక్తి వేషాలు అలరించాయి. పడాల ఆడపడుచు కావడంతో పడాల కుటుంబ సభ్యులు, వారి ఆడపడుచులు అందరూ ఎక్కడ ఉన్న ఈ జాతర రావడం ఆనవాయితీ. కమిటీ సభ్యులు పడాల కమలారెడ్డి, కర్రి సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక పుస్తకాలూ చదవాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): విద్యార్థులు పాఠ్య పుస్తలకాలతో పాటు సామాజిక పుస్తకాలు చదవాలని బీవీకే ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల ముగింపు సభలో మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. బాలాజీదాస్ విజ్ఞాన కేంద్రం (బీవీకే) ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సహకారంతో నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. ఎస్‌కేవీటీ హైస్కూలులో జరిగిన శిక్షణ తరగతులకు సుమారు 150 మంది పైగా విద్యార్థులు హాజరయ్యారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు అరుణ్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బి.పవన్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పందలపాకలో సినిమా చిత్రీకరణ



పందలపాకలో సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న యూనిట్ సభ్యులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని సినిమా షూటింగ్ సందడి నెలకొంది. శనివారం పందలపాక శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద రేవులోని, కొంకుదురు బుడిత మామిడి వద్ద రేవులోని కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. స్థానిక మేనజర్ సత్యబాల మాట్లాడుతూ క్రిష్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో నిర్మిస్తున్న చిత్రంలో హీరోగా తిరువీర్, హీరోయిన్‌గా పాయల్ నటిస్తున్న చిత్రం పేరు పాపం ప్రతాప్. ప్రధాన పాత్రధారులుగా అజయ్ ఘోష్, ప్రసాద్ బెహరా నటిస్తున్నారన్నారు. దుర్గా నరేష్ దర్శకత్వం చేస్తుండగా, రాజేష్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 9 నుంచి నెల రోజులపాటు పరిసర గ్రామాల్లో చిత్రం షూటింగ్ చేస్తున్నట్టు యూనిట్ సభ్యులు తెలిపారు.

ఘనంగా అన్న సమారాధన

కోరుకొండ: మండలంలోని కాపవరం అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీసంతాన వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దీనికి బీజేపీ నేత, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు 500 కేజీల బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కంబాలను ఉత్సవ కమిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

నీట్ విజేత సంతోష్‌రెడ్డికి సత్కారం



విద్యార్థి మల్లిడి సంతోష్‌రెడ్డిని సత్కరిస్తున్న తిరుమల సంస్థల చైర్మన్ తిరుమలరావు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామానికి చెందిన మల్లిడి సంతోష్‌రెడ్డి నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 1518 ర్యాంక్, ఎంసెట్‌లో 12 ర్యాంకు సాధించడంతో రాజమహేంద్రవరం తిరుమల విద్యా సంస్థల చైర్మన్ తిరుమల రావు అతడిని సత్కరించారు. వీరి తల్లిదండ్రులు పందలపాక సూరారెడ్డి నర్సింగ్‌హోమ్ అధినేత డాక్టర్ కృష్ణారెడ్డి, సంధ్యాదేవి. సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి రైతు కుటుంబంలో జన్మించి డాక్టర్‌గా 14 ఏళ్లగా గ్రామీణులకు వైద్య సేవలు అందిస్తున్నారని, ఆయన అడుగు జాడల్లో తాను డాక్టర్ కావాలని కోరుకుంటున్నట్టు తెలిపాడు. ఎయిమ్స్‌లో ఉచితం సీటు వస్తుందని అనుకుంటున్నానని అతడు తెలిపాడు. సంతోష్ రెడ్డిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఐఎంఏ అనపర్తి శాఖ అధ్యక్షుడు డాక్టర్ టి.రామగురెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, నేత్ర వైద్యులు టి.సత్యనారాయణ రెడ్డి, పందలపాక సర్పంచి సబ్బారపు పద్మావతి, ఉప సర్పంచి పడాల వెంకటరామారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనువాస్‌రెడ్డి తదితరులు అభినందించారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న సంపర వెంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో కొలువైన శ్రీ, భూ సమేత వెంకటేశ్వర స్వామి వారికి జ్యేష్ఠ మాసం బహుళ తదియ శనివారాన్ని పురస్కరించుకుని పంచామృతాభిషేకం, తదితర పూజలు చేశారు. అలాగే తులసిదళాలతో విశేష పూజలు, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారికి గోవిందనామ స్మరణ చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



సంపరలో ప్రత్యేక అలంకరణలో ఉన్న వినాయకుడు

వినాయకునికి గరిక పూజ

సంకట హర చతుర్థి సందర్భంగా సంపరలో పంట కాలువ సమీపంలో ఉన్న వినాయకునికి గరిక పూజ చేశారు. అలాగే పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

అనపర్తి రండి.. అవినీతి చూపిస్తా..

- సీఎం చంద్రబాబుకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సవాల్
- వాటాలకు కక్కుర్తి పడితే మూల్యం తప్పదని హెచ్చరిక



మట్టి అక్రమ రవాణా జరుగుతున్న తీరును చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నియోజకవర్గానికి వస్తే స్థానిక బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నిర్వహిస్తున్న మట్టి దందా, అవినీతి బాగోతం స్వయంగా చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని నల్లమిల్లి గ్రామంలో మట్టి అక్రమ రవాణా జరుగుతున్న జగన్నాథసాగరం చెరువు వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఎన్నికల ముందు అనపర్తిలో నిర్వహించిన పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడుతున్నప్పుడు ఆయన చెవిలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెప్పిన సూచనతో తనను గ్రావెల్ సూర్యనారాయణరెడ్డి అని వ్యంగ్యంగా సంభోదించారని, ఈ రోజు అనపర్తిలో ఎవరు గ్రావెల్‌ని, మట్టిని అడ్డగాడిదలా మెక్కేస్తున్నారో చూపిస్తానని సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఈ కుంభకోణంపై అధికారులకు ఫిర్యాదు చేసి ఆరు రోజులవుతున్నా ఒక్క అధికారీ స్పందించకపోవడంతో అవినీతి, అక్రమాలకు ప్రభుత్వం ఎంత పెద్దపీట వేస్తోందో స్పష్టమవుతోందన్నారు. ఈ అక్రమ సంపాదనలో అధికారుల వాటా ఎంతో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 164 మంది ఎమ్మెల్యేల్లో ఇక్కడి ఎమ్మెల్యే అంటే ఎవరో గుర్తించకపోవచ్చని, ఎన్నికల ముందు ఆయనకు టికెట్ ఇస్తే గెలవరని, బీజేపీకి పంపిన ఎమ్మెల్యేను చేసిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అని ఆయన గుర్తు చేశారు.

ఎంపీ పురందేశ్వరి స్పందించాలి...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందరేశ్వరి కూడా ఇప్పటి వరకు ఈ విషయంపై స్పందించ లేదని, అంటే ఆమె కూడా నల్లమిల్లి అక్రమ దందాను ప్రోత్సహిస్తున్నారని అర్థం అవుతోందని సూర్యనారాయణరెడ్డి అన్నారు. పాత్రికేయులు కూడా ప్రజాధనం దుర్వినియోగం బాగోతాలను వెలికితీసేందుకు కృషి చేయాలని ఆయన సూగుతున్న బాగోతాలను వెలికితీయడానికి తమ వంతు కృషి చేయాలని ఆయన అన్నారు. మట్టి దందాపై న్యాయపోరాటం చేస్తామని, అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి, వాళ్లు ఆశ చూపిస్తున్న అవినీతి సొమ్ముకు కక్కుర్తిపడి అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నల్లా దుర్గాప్రసాద్, మట్టా శ్రీను, ప్రగడరెడ్డి గౌరీశంకర్, కొండేపూడి చిన్నా, కంచుమర్తి సాయిబాబా, మామిడాల సూరిబాబు, గొల్లపల్లి రవి, మట్టా ప్రసాద్, నల్లా తేజ, మల్లెంపూడి బుల్లియ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వెనుక ఉన్న దుకాణాలను అధికారులు శనివారం తొలగించారు. రైతులు పంట బోదె కాలువపై దుకాణాలు నిర్మించారని ప్రజా సమస్యల వేదికలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల ద్వారా ఏ మేరకు అక్రమణకు గురైందనే విషయమై సర్వే చేసి పోలీసు బందోబస్తుతో షాపులను తొలగించారు.

వ్యక్తి అదృశ్యం



గుబ్బల ఏసుబాబు (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన తండ్రి కనిపించడం లేదని పాత బొమ్మూరుకు చెందిన గుబ్బల రవి దుర్గాప్రసాద్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పాత బొమ్మూరు గ్రామానికి చెందిన 60 ఏళ్ల గుబ్బల ఏసుబాబు హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపంలో పరుపులు ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నాడు. అయితే ఫ్యాక్టరీ నష్టం రావడంతో ఏసుబాబు కొంతకాలంగా మనస్తాపంతో ఉంటున్నాడు. దీంతో కుటుంబ సభ్యులతో గొడవపడి ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడని, పరిసర ప్రాంతాలలో, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదని దుర్గాప్రసాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ యోగాసనాలు నేర్వాలి



యోగాసనాలను సాధన చేస్తున్న 'నన్నయ' సిబ్బందితో వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

పెదపూడి: ప్రతి ఒక్కరూ యోగాసనాలు నేర్చుకోవాలని ఎంపీడీఓ టీవీఆర్ మణిదీప్ తెలిపారు. రామేశ్వరంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ కొటికలపూడి చినబాబు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు వివిధ శాఖల సిబ్బంది యోగా శిక్షణలో పాల్గొన్నారు. అలాగే మండలంలోని కైకవోలు, జి.మామిడాడ, సంపర, శహపురం, పెద్దాడ, ఏపీ త్రయం, పెదపూడి తదితర గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఇతర ప్రాంతాల్లో యోగా శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సూర్యనారాయణరెడ్డి, కొటికలపూడి సత్తిబాబు, ఉపసర్పంచ్ దుళ్ల వీర వెంకట సత్యనారాయణ, పబ్బినీడి హేమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

బిక్కవోలు: యోగాను జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనచ్చని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని సచివాలయాల వద్ద అధికారులు, ఉద్యోగులు యోగా చేశారు. ఈ సందర్భంగా బిక్కవోలు సచివాలయం వద్ద ఆయన మాట్లాడుతూ యోగా మనసును, శరీరాన్ని ఒకటి చేస్తుందని, నిత్యం యోగ సాధన ద్వారా జ్ఞాపకశక్తితో పాటు మానసిక, శారీరక దృఢత్వం మెరుగు పడుతుందన్నారు. తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రంగంపేట: శారీరక, మానసిక ఆరోగ్యానికి నిరంతరం యోగాభ్యాసాలు చేయాలని మండల ప్రత్యేకాధికారి బీవీ గిరి సూచించారు. శనివారం స్థానిక ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో ఎంపీడీఓ వీవీ సాయిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒత్తిడిలేని జీవితానికి ధ్యానం, యోగా ఉపయోగపడతాయని అన్నారు. ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సాయిబాబు కోరారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి, ఉపాధి హామీ ఏపీఓ నాగేశ్వేణి, ఉప సర్పంచ్ బి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



రామేశ్వరంలో యోగా శిక్షణలో పాల్గొన్న ఎం

కోరుకొండ మండలంలో..

కోరుకొండ: మండలంలో శనివారం యోగా ట్రయిల్ రన్ నిర్వహించారు. మండలంలోని 24 సచివాలయాల పరిధిలో యోగా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం వేళల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఉద్యోగులు, యువత హాజరవుతున్నారు. దానిలో భాగంగా కోరుకొండ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, వ్యవసాయ శాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, కార్యదర్శి రమేష్‌బాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కర్రి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ'లో యోగాంధ్ర

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది యోగాసనాలు సాధన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అనుసరించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ×వన్ ఎర్త్ – వన్ హెల్త్౯ నినాదంతో అందరూ యోగా సాధన చేయాలని, అంతా ఆరోగ్యంగా ఉండాలనే ఆకాంక్షతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 18న మెగా కార్యక్రమాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ తెలిపారు. విద్యార్థులంతా ముందుగా తమ పేర్లను యోగాంధ్ర పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

నిత్య సంజీవిని యోగా

అనపర్తి: నిత్యం యోగా ఆచరించడం వలన ఆరోగ్యంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉంటుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని శ్రీరామారెడ్డి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో యోగాంధ్ర ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలోని అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23 కిలోల గంజాయి పట్టివేత



గంజాయి పట్టివేత వివరాలు వెల్లడిస్తున్న నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్, సీఐ వీరయ్యగౌడ్ తదితరులు

- ఇద్దరి అరెస్టు
- సరకుతో పాటు, పలు వాహనాల స్వాధీనం

రాజానగరం: మండలం కొండగుంటూరులో అక్రమంగా తరలిస్తున్న 23.101 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ శనివారం విలేకరులకు తెలిపిన వివరాల మేరకు కొండగుంటూరులోని ఒక లే అవుట్‌లో ఉన్న రేకుల షెడ్డు వద్ద స్థానిక సీఐ వీరయ్యగౌడ్, ఎస్సై కేవీ నాగార్జున తమ సిబ్బందితో కలసి శుక్రవారం రాత్రి దాడి చేసి, తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఉన్న టాటా వాహనంలో గంజాయి ప్యాకెట్లను, వాటిని రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రంలోని చిత్రకొండ మండలం, దొరగుడ పంచాయతీకి చెందిన సురేష్ చంద్ర కులదీప్ (30), అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, పొల్లూరుకు చెందిన మనోరంజన్ మండల్ (20)లను అదుపులోకి తీసుకున్నారు. అక్కడే ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్, ఒక కారు, బజాజ్ వెస్పా స్కూటీ, టాటా అల్ట్రా గూడ్స్ క్యారియర్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు.

భార్యాభర్తలే సూత్రధారులు

గంజాయి అక్రమ రవాణాలో పాత్రధారులు చిక్కగా, సూత్రధారులు తప్పించుకున్నారు. ఉత్తారాదికి చెందిన రఘువీర్ రాయ్, అతని భార్య ప్రశాంతి రాయ్ ఈ గంజాయి అక్రమ వ్యాపారంలో ఆరితేరారు. ఒడిశా రాష్ట్రంలోని చిత్రకొండ ఏరియా నుంచి శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో టాటా వాహనంలో గంజాయిని కొండగుంటూరుకు తీసుకువచ్చారు. ఈ రవాణా చేసే సమయంలో వారి వాహనానికి ముందు రాయల్ ఎన్ఫీల్డ్ మోటారు బైకుపై ఒక వ్యక్తి పైలెట్‌గా వ్యవహరించాడు. తీసుకువచ్చిన గంజాయిని రేకుల షెడ్డులో భద్రపరచాలని ఆదేశించి ఆ భార్యభర్తలు వ్యక్తిగత పనులపై రాజమహేంద్రవరం వెళ్లారు. ఇటీవలే ఈ ప్రాంతానికి వచ్చిన వారు కొంతకాలం రాజమహేంద్రవరం రూరల్ మండలం, కొంతమూరులో ఒక ఇల్లు కొనుగోలు చేసి, నివాసం ఉండేవారు. తరువాత ఆ ఇంటిని విక్రయించి, కొండగుంటూరుకు వచ్చి, ఇక్కడ కొత్తగా వేసిన లేఅవుట్‌లో ఒక ప్లాట్ (స్థలం) కొనుగోలు చేసి, భవంతిని నిర్మించే ప్రయత్నంలో ఉన్నారు. ఇందులో భాగంగా వేసిన రేకుల షెడ్డును గంజాయి నిల్వకు వాడుకుంటున్నారు. ఎవరైనా అడిగితే సీసీ కెమేరాల వ్యాపారం చేస్తున్నామంటూ ఆ ముసుగులో గంజాయి అక్రమ వ్యాపారం చేస్తూ వచ్చారు. వీరిపై కోరుకొండ, గోకవరం, విశాఖపట్నం, ఇతర పోలీసు స్టేషన్లలో కేసులున్నాయని డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ వీరయ్యగౌడ్, ఎస్సైలు కేవీ నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.